# సెల్ టవర్ తో ఫియర్





వాస్తవాలు పలుకు

DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక








హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 64 | 17-07-2026 శుక్రవారం | పేజీలు: 08 | వెల: 3/-




# సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం..

**సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో ఘటన**

**ఇస్లామిక్ సూక్తులు నేర్చుకోవాలంటూ హిందూ విద్యార్థికి హోంవర్క్**

**డైరీని గమనించి షాక్ కు గురైన తల్లిదండ్రులు**

**స్కూలు గుర్తింపు రద్దు చేయాలన్న రాంచందర్ రావు**

హైదరాబాద్, (డిడి9 వార్త):

హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అక్కడి 'సక్సెస్ స్కూల్'లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి... ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్‌ఫాతిహా' చదివి, నేర్చుకు రావాలంటూ ఉపాధ్యాయురాలు హోంవర్క్ ఇవ్వడం, స్కూల్ డైరీలో లిఖితపూర్వకంగా రాయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

బాలుడు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత డైరీని గమనించిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే విద్యార్థులపై ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం మిగతా 3లో..

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యుత్ సంక్షోభం

**11 జిల్లాల్లో ధర్నాలు.. సబ్‌స్టేషన్ల ముట్టడికి రైతులు**

**బొగ్గు నిల్వల కొరతే పవర్ కట్‌లకు కారణం: హరీష్ రావు**

**బొగ్గు, విద్యుత్, ఇసుకలో స్కామ్‌లు జరుగుతున్నాయన్న ఆరోపణ**

**అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు**

**ప్రభుత్వానికి ముందుచూపు లేక రాష్ట్రం అంధకారంలోకి: హరీష్**

**రిజర్వాయర్లలో కేవలం 33 శాతం నీటి నిల్వలేనని ఆందోళన**

**ప్రతిపక్ష హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ**

**థర్మల్ ప్లాంట్లలో 6–7 రోజుల బొగ్గు నిల్వలు కూడా లేవు**

**విద్యుత్ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపణ**



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస ముందుచూపు లేకపోవడం వల్లే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తోందని మండిపడ్డారు. "ఒకప్పుడు కరెంట్ పోతే వార్త.. కానీ ఈ చేతకాని ప్రభుత్వ పాలనలో ఇప్పుడు కరెంట్ ఉంటేనే వార్తగా మారింది" అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగ్గా లేకపోవడంతో ఇప్పటికే 11 జిల్లాల్లో భారీ ఎత్తున ధర్నాలు జరిగాయని, చాలా చోట్ల రైతులు ఆగ్రహంతో సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని గుర్తుచేశారు. అప్రకటిత కరెంట్ కోతలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**బొగ్గు కొరత, విచ్చలవిడి స్కామ్‌లు!**

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కనీసం 6 నుంచి 7 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు కూడా లేకపోవడం వల్లే ఈ తీవ్రమైన విద్యుత్ సమస్య తలెత్తిందని హరీష్ రావు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, కనీస నిర్వహణ లోపం వల్ల బొగ్గు నిల్వలు లేక విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా కుంటుపడిందని స్పష్టం చేశారు. "ఈ ప్రభుత్వంలో బొగ్గు లో స్కాం, పవర్ లో స్కాం, సాండ్ (ఇసుక) లో స్కామ్‌లు విచ్చలవిడిగా బయటపడుతున్నాయి" అని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో కేవలం 33 శాతం మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంగా తాము నిరంతరం ప్రభుత్వాన్ని నిద్రలేపుతున్నా, పాలకుల్లో కనీస ఉలుకూ పలుకూ లేదని ధ్వజమెత్తారు.

**7,180 మెగావాట్ల సామర్థ్యం ఉన్నా.. ఉత్పత్తి సగమే**

తెలంగాణ రాష్ట్రంలో సరిపడా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉందని హరీష్ రావు మిగతా 2లో..

# పూరీ జగన్నాథ రథయాత్రలో విషాదం..

**తొక్కిసలాటలో ఒకరు మృతి, 100 మందికిపైగా గాయాలు**

**లక్షలాది మంది భక్తుల రద్దీతో రథయాత్రలో అపశ్రుతి**

**తొక్కిసలాటలో కటక్‌కు చెందిన అనిల్ దాస్ మృతి**

**100 మందికిపైగా భక్తులకు గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స**

**సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు, అత్యవసర వైద్య బృందాలు**

**ఘటనపై అధికారులు ఆరా.. రద్దీ నియంత్రణకు అదనపు భద్రత**

హైదరాబాద్, (డిడి9 వార్త):

ఒడిశాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలో జరుగుతున్న శ్రీ జగన్నాథ రథయాత్రలో విషాద ఘటన చోటుచేసుకుంది. లక్షలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొనేందుకు తరలిరావడంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో కటక్‌కు చెందిన అనిల్ దాస్ అనే భక్తుడు మృతిచెందగా, 100 మందికిపైగా భక్తులు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు, వైద్య సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరికి స్వల్ప గాయాలు కాగా, మరికొందరి పరిస్థితిపై వైద్యులు నిఘా ఉంచినట్లు తెలుస్తోంది.

రథయాత్ర సందర్భంగా శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి రథాలను దర్శించేందుకు వేలాదిగా భక్తులు ఒకేచోట చేరడంతో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుని తొక్కిసలాటకు దారితీసినట్లు ప్రాథమిక సమాచారం. ఘటన జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో భక్తులను క్రమబద్ధంగా బయటకు తరలించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై పోలీసులు, జిల్లా యంత్రాంగం విచారణ ప్రారంభించారు. తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులు, మిగతా 2లో..



# హిందూ సంస్కృతిపై దాడి చేస్తే ఊరుకోం

**ప్రైవేట్ స్కూల్ వివాదంపై కేంద్ర మంత్రి బండి నిప్పులు**

**మజ్లిస్, పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం**

**సైదాబాద్ స్కూల్ హోంవర్క్ వివాదంపై ధ్వజం**

**హిందూ విద్యార్థులపై కల్మా బలవంతపు రుద్దుడు దుర్మార్గం**

**సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై తక్షణమే కఠిన చర్యలకు డిమాండ్**

**సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపు**

**సెక్యులర్ సంఘాల మౌనంపై బండి సంజయ్ సూటి ప్రశ్న**

**ఇలాంటి ఘటనలపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆగ్రహం**



హైదరాబాద్, (డిడి9 వార్త):

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర పరిధిలోని సైదాబాద్ ప్రాంతంలో ఉన్న సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో చోటుచేసుకున్న ఒక ఉదంతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. స్కూల్‌లో చదువుతున్న మిగతా 2లో..

## సీతారామ ప్రాజెక్టుపై భట్టి కీలక ప్రకటన..

# ఇక వెనక్కి తగ్గేది లేదు..

**సీతారామ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు**

**రీడిజైన్‌పై కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు**

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం**

**ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం**

హైదరాబాద్, (డిడి9 వార్త):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు.

**వైఎస్సార్ హయాంలోనే పునాది.. కేసీఆర్ పాలనలో వ్యయం పెంపు**

గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మిగతా 2లో..



# కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిపోయింది

**బీఆర్ఎస్ పాలనపై ఉత్తమ్ విమర్శలు**

**రీ-డిజైనింగ్ పేరుతో భారీ వ్యయం**

**కాళేశ్వరం కూలడానికి కమిషన్లే కారణం**

**బ్యారేజీల మరమ్మతులకు ప్రభుత్వం సిద్ధం**

హైదరాబాద్, (డిడి9 వార్త):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను సందర్శించిన అనంతరం గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2023లో తాను ఇరిగేషన్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి శాఖపై లోతుగా సమీక్షలు జరిపానని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అద్భుతాల ప్రచారమంతా పచ్చి అబద్ధమని తేలిపోయిందన్నారు. గత పాలకుల హయాంలో జలవనరుల శాఖలో అడ్డూఅదుపూ లేకుండా జరిగిన వందల కోట్ల అక్రమాలు, మిగతా 2లో..



# అడవుల రక్షణతోనే మానవ మనుగడ

**పాతకాలపు అలవాట్లు నేడు బంగారంతో సమానం**

**మంత్రి దనసరి సీతక్క పిలుపు!**

**గొనెపల్లిలో మహిళా సంఘాలకు తేనెటీగల పెంపకం శిక్షణ**

**ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించిన మంత్రి సీతక్క**

**ప్రకృతి ప్రసాదించిన ఫలాలతోనే సంపూర్ణ ఆరోగ్యం**

**ప్లాస్టిక్ ప్లేట్ల వాడకంతో పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారి**

**మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట**

**వడ్డీ లేని రూ.10 లక్షల రుణాల పంపిణీపై మంత్రి వెల్లడి**

హైదరాబాద్, (డిడి9 వార్త):

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సరికొత్త ఉపాధి మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా గురువారం నాడు ములుగు జిల్లా తాడ్వాయి మండలం గొనెపల్లి గ్రామంలో ఒక ముఖ్యమైన శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, ఇందిరా మహిళాశక్తి జీవనోపాధుల పథకం కింద మహిళా సంఘాల సభ్యులకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల మిగతా 2లో..





# పూరీ జగన్నాథ రథయాత్రలో విషాదం..

మొదటిపేజీ తరువాయి

భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా ఆరా తీస్తున్నారు. భక్తులు ఆందోళనకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలని, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం..

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేస్తూ బంధువులు, స్థానికులతో కలిసి నేరుగా స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని సూటిగా నిలదీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. బాధితులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం వెలుగులోకి రాగానే అలర్ట్ అయిన సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. ఇది సదరు టీచర్ వ్యక్తిగతంగా చేసిన పొరపాటుగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదానికి కారణమైన ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో తమ విద్యాసంస్థల్లో ఆమెకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, పాఠశాలలో ఇలాంటి మతపరమైన బోధనలకు తావు లేదని స్పష్టం చేసింది.

ఈ ఉదంతంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అత్యంత తీవ్రంగా స్పందించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అనే ప్రకటనల వల్లే ఇలాంటి శక్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మండిపడ్డారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... చిన్నారిపై మతపరమైన ఒత్తిడి తీసుకురావడం ఘోరమని, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యుత్ సంక్షోభం

మొదటిపేజీ తరువాయి




గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలో 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఈ ప్రభుత్వ చేతకానితనం వల్ల కేవలం 3,190 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నడిపే వారికి కనీస అవగాహన, సోయి లేదని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇంధన శాఖను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కనీస బాధ్యత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలకు కనీసం 8 గంటల విద్యుత్‌ను కూడా అందించలేకపోతున్నారని విమర్శించారు.

# నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్స్ విక్రయిస్తున్న ఆర్ఎఫ్సిఎల్ శ్రీ చైతన్య హైస్కూల్ పై చర్యలు తీసుకోవాలి.

- విద్య వ్యాపారమే శ్రీ చైతన్య హైస్కూల్ ధ్యేయం.ఏ ఐ ఎస్ ఎఫ్, ఎన్ ఎస్ యు ఐ.

**డిడి9వార్త / రామగుండం జులై 17:**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బడి బట్టలను విక్రయిస్తున్న ఆర్ఎఫ్.సి.ఎల్ శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఎన్ఎస్.యూ.ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం,ఎన్ఎస్.యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గ మాట్లాడుతూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా రంగురంగుల కరపత్రాలతో హంగు ఆర్భాటాలతో లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ మోసం చేస్తున్నారని, విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారే విద్య వ్యాపారం చేస్తున్నారని ఆయన అన్నారు. శ్రీ చైతన్య హైస్కూల్ యాజమాన్యం ఒక క్వాటర్ను కిరాయికి తీసుకొని ఆ రూములో బడి బట్టలను అధిక ధరలకు నిబంధనలకు విరుద్ధంగా విక్రయించడం జరుగుతుందని,సమాచారం తెలియగానే అక్కడికి వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శ్రీ చైతన్య హై స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్,ఎన్ఎస్.యూ.ఐ గా ఆందోళన చెయ్యగా మండల విద్యాధికారి జింక మల్లేష్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులచే ఆ రూమ్ ని సీజ్ చేయడం జరిగింది. విద్యా వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాల అనుమతులను కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు .లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని కూడా వారు హెచ్చరించారు.



# కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిపోయింది

మొదటిపేజీ తరువాయి

అవినీతి విచారణలో బయటపడ్డాయని ఆయన వెల్లడించారు.

**రీ-డిజైనింగ్ దోపిడీ.. లక్ష కోట్లు పెట్టినా సున్నా**

గత ప్రభుత్వం సగం పూర్తయిన ప్రాజెక్టులను సైతం కేవలం రీడిజైనింగ్ పేరుతో మార్చేసి అంచనా వ్యయాలను ఇష్టారాజ్యంగా పెంచిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. పదేళ్ల సుదీర్ఘ కాలంలో కనీసం దేవాదుల ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేయలేకపోయారని, సీతారామ ప్రాజెక్టు కోసం రూ. 8,000 కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ఫలితం రాలేదని మండిపడ్డారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అని డబ్బా కొట్టుకుంటూ దాదాపు లక్ష కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు నిట్టనిలువునా కూలిపోయింది. కేవలం కమిషన్ల కోసం కక్కుర్తి పడి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చింది. అన్నారం బ్యారేజీని ఒకచోట డిజైన్ చేసి, దానికి పూర్తి భిన్నంగా మరొక చోట నిర్మించారు. ఫలితంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం అసలు వినియోగానికే పనికిరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) తేల్చి చెప్పింది" అని మంత్రి స్పష్టం చేశారు.

**రిపేర్లు పూర్తి చేస్తాం..**

**తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు**

కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల నుండి ఒక్క చుక్క నీటిని కూడా తీసుకోకుండానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాష్ట్రంలో అత్యధికంగా వరి పంట పండేలా చేసి చూపించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ప్రకృతి సిద్ధంగా వచ్చిన కరువును చూపిస్తూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం తాము పూర్తిగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందడుగు వేస్తున్నామని వివరించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను పునరావాసం (రిహబిలిటేషన్)



పరిధిలోకి తెచ్చి, త్వరితగతిన రిపేర్లు పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన ఘోరమైన తప్పులన్నింటినీ సరిదిద్ది, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# హిందూ సంస్కృతిపై దాడి చేస్తే ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

హిందూ విద్యార్థులకు కల్మా, సూరహ్ ఫతేహ్ చదవాలంటూ ఉపాధ్యాయులు హోంవర్క్ ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు బరితెగించి బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. పసిపిల్లలపై ఇలాంటి ధార్మికాంశాలను హుకుం జారీ చేస్తూ బలవంతంగా రుద్దాలని చూడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ధ్వజమెత్తారు.

ఈ వివాదాస్పద ఘటనకు కారణమైన సైదాబాద్ సక్సెస్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం, బాధ్యులపై విద్యాశాఖ మరియు పోలీస్ శాఖ తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తాజాగా ఒక అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యను నేర్పించాల్సింది పోయి, ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఈ దుశ్చర్యను కులమతాలకు అతీతంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

నగరంలో ఇంత పెద్ద వివాదం జరుగుతున్నా, హిందూ విద్యార్థుల హక్కులకు భంగం వాటిల్లుతున్నా రాష్ట్రంలోని మేధావులు, సెక్యులర్ సంఘాలు మౌనంగా ఉండటాన్ని కేంద్ర మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. నిరంతరం సెక్యులరిజం గురించి మాట్లాడే సదరు సంఘాల నాయకులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని సూటిగా ప్రశ్నించారు. వేరే విషయాల్లో చిన్న చిన్న సంఘటనలు జరిగినా పెద్ద ఎత్తున స్పందించే వారు, హిందూ సంస్కృతిపై ఇంత బహిరంగంగా దాడి జరుగుతుంటే ఎందుకు మౌన వ్రతం వహించారో సమాజానికి సమాధానం చెప్పాలని బండి సంజయ్ నిలదీశారు.

రాష్ట్రంలో రానున్న రోజుల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారబోతున్నాయని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి రావడం పక్కా అని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికార బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్రంలోని పాఠశాలల్లో చదువుకునే హిందూ విద్యార్థులందరికీ బొట్టు పెట్టుకోవడాన్ని తప్పనిసరి చేస్తామని సంచలన ప్రకటన చేశారు. విద్యార్థులు తమ సాంప్రదాయాలను గౌరవించేలా చూస్తామన్నారు. విద్యాసంస్థల్లో హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పటిష్టంగా పాటించేలా అన్ని రకాల కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇటీవల నగరంలో జరిగిన ఆటో డ్రైవర్ భరత్ ఉదంతాన్ని కూడా బండి సంజయ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆటో డ్రైవర్ భరత్‌ను



కొందరు పోలీసులు మరియు మజ్లిస్ పార్టీ నాయకులు కలిసి తీవ్రమైన వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ఒక సామాన్య ఆటో డ్రైవర్‌ను టార్గెట్ చేసి వేధించిన సదరు పోలీసు అధికారులు, మజ్లిస్ నాయకులపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు తాము ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు.

నగరంలో జరుగుతున్న ఇలాంటి వరుస అక్రమాలు, ఏకపక్ష వేధింపుల ఘటనలపై ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడం సరికాదని బండి సంజయ్ హితవు పలికారు. అధికార పక్షం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇలాంటి వాటిని నిర్లక్ష్యం చేస్తే, ఈ తరహా ఉదంతాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజధాని నుంచి తెలంగాణ అంతటా విస్తరించే ప్రమాదం ఉందని తీవ్రంగా హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే రాష్ట్రంలో అశాంతి రేగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్ భరత్ వ్యవహారంలో చట్టం తన పక్షపాత బుద్ధిని చూపిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. అసలు భరత్ రాసిన రాతల్లో చట్ట వ్యతిరేకమైనది ఏముందని ఆయన ప్రశ్నించారు. నగరంలో ఎన్నో ఆటోలపై, బహిరంగ గోడలపై హిందువుల మనోభావాలను కించపరిచేలా ఉర్దూ భాషలో రాతలు రాసుకున్న వారిపై పోలీసులు ఎందుకు సుమోటోగా కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. మజ్లిస్ నాయకులకు ఒక న్యాయం, సామాన్యుడైన భరత్‌కు మరొక న్యాయమా అని, చట్టం అందరికీ సమానంగా వర్తించదా అని పోలీసుల తీరును తప్పుపట్టారు.

హిందూ సమాజం యొక్క ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడటానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని బండి సంజయ్ స్పష్టం చేశారు. సైదాబాద్ స్కూల్ ఘటన కేవలం ఒక పాఠశాల సమస్య కాదని, ఇది హిందూ సంస్కృతిపై జరుగుతున్న క్రమబద్ధమైన దాడి అని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు నైతిక విలువల కంటే ఇలాంటి పద్ధతులు నేర్పడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేదే లేదని, బాధ్యులపై చట్టపరమైన విచారణ జరిపించి స్కూల్‌పై తగిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకువస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ తన ప్రకటన ద్వారా భరోసా ఇచ్చారు.

# బోధన్ ఆర్టీసీ డిపోలో పాత వస్తువుల వేలం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 16(డీడీ9 వార్త):**

బోధన్ ఆర్టీసీ డిపో పరిధిలోని కార్గో పార్సల్ సర్వీసులో నిల్వ ఉన్న పాత వస్తువులకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బోధన్ బస్టాండ్‌లోని స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో జరుగుతుందని ఆయన వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న ప్రజలు నిర్ణీత సమయానికి హాజరై, తమకు అవసరమైన వస్తువులను వేలం ద్వారా కొనుగోలు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

## సీతారామ ప్రాజెక్టుపై భట్టి కీలక ప్రకటన..

# ఇక వెనక్కి తగ్గేది లేదు..

మొదటిపేజీ తరువాయి

4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీడిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు.

**వెనక్కి తగ్గేదే లేదు..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# అడవుల రక్షణతోనే మానవ మనుగడ

మొదటిపేజీ తరువాయి



పెంపకంపై ప్రత్యేక శిక్షణను ఆమె అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అడవులతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఇప్పపువ్వు, మోదిగాకులు, అడవి తేనె మానవ ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని చెప్పారు. మన పూర్వీకుల పాతకాలపు నాటి జీవన విధానం మరియు ఆహార అలవాట్లు నేటి రోజుల్లో బంగారంతో సమానమని కొనియాడారు. ఆధునిక కాలంలో ప్లాస్టిక్ ప్లేట్లలో వేడి ఆహారం తీసుకోవడం వల్లే ప్రజలు క్యాన్సర్ వంటి భయంకరమైన రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాంప్రదాయ మోదిగాకుల్లో భోజనం చేయడం వల్ల శరీరానికి ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు.

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా, సొంతంగా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి వడ్డీ లేని రూ.10 లక్షల వరకు భారీ రుణాలను ప్రభుత్వం అందిస్తోందని వెల్లడించారు. ఈ విధంగా పొందిన బ్యాంకు రుణాలను మహిళలు వృథా చేయకుండా, సరైన ఉపాధి మార్గాల్లో పెట్టుబడిగా పెట్టి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని చెప్పడానికి మంత్రి సీతక్క ఒక అద్భుతమైన ఉదాహరణను పంచుకున్నారు. గత కొద్ది నెలల క్రితం ఎస్ఎస్ తాడ్వాయి మండలం పరిధిలోని కొండపర్తి గ్రామంలో కేవలం రూ.50 వేల స్వల్ప పెట్టుబడితో మహిళలు ఒక ఇప్పపువ్వు లడ్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అడవిలో దొరికే ఇప్పపువ్వుతో వారు చేసిన లడ్లకు మార్కెట్లో మంచి ఆదరణ లభించిందన్నారు. ఆ చిన్న వ్యాపారంతో నేడు మహిళా సంఘం సభ్యురాళ్లు ఏకంగా రూ.5 లక్షల వరకు భారీ ఆదాయాన్ని ఆర్జించి రికార్డు సృష్టించారని మంత్రి అభినందించారు.

కొండపర్తి గ్రామం తరహాలోనే గొనెపల్లి గ్రామంలోని మహిళలు కూడా తేనెటీగల పెంపకం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని మంత్రి సూచించారు. ఇందుకోసం హంబుల్ బీ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ శాస్త్రీయ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలందరూ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో నాణ్యమైన తేనెను సేకరించడం ద్వారా మార్కెట్లో మంచి ధర లభిస్తుందని, తద్వారా ప్రతి కుటుంబానికి స్థిరమైన ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు.

వ్యవసాయ రంగం మరియు ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై కూడా మంత్రి సీతక్క ఈ వేదికగా స్పందించారు. ప్రస్తుత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రైతులు కేవలం సాంప్రదాయ వరి పంటపైనే ఆధారపడకుండా, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని హితవు పలికారు. నీటి ఎద్దడిని తట్టుకునే పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాల నుంచి గట్టెక్కవచ్చని రైతులకు సూచించారు.

రైతు సోదరులు తమ పొలాల్లో కందులు, పెసర్లు, మొక్కజొన్న వంటి అల్పావధి మరియు చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని మంత్రి కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లో వీటికి విపరీతమైన ఆదరణ పెరుగుతోందని, రానున్న రోజుల్లో ఈ ప్రత్యామ్నాయ పంటలకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ మరియు గిట్టుబాటు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారులు కూడా గ్రామాల్లో పర్యటించి రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై తగిన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఉమ్మడి ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడింది. ఈ వేదికపై ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీవో) నవీన్ వత్సల్ టొప్పోలు పాల్గొని మహిళలకు దిశానిర్దేశం చేశారు. వీరితో పాటు అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు మరియు స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణికి గనులు రాకపోవడానికి బీజేపీ కారణం.

- కొత్త గనులు సింగరేణికే కేటాయించాలి.
- 12వ వేజ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి.
- కార్మికుల డిమాండ్ లను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు నిస్తాం.
- ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్.

**డిడి9వార్త / రామగుండం జులై 17:**

సింగరేణికి కొత్త గనులు రాకపోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కారణమని గుర్తింపు సంఘం ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్ ఆరోపించారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి5 లో జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ, తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమాన్ని ఏఐటియుసి చేపట్టిందని, 2012లో అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి సేవ్ సింగరేణి పేరు తో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ బ్లాక్ ను సింగరేణికి కేటాయించేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించకుండా ప్రైవేటు సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి నష్టపోతోందని ఆయన విమర్శించారు. సింగరేణిలో రాష్ట్రానికి 51%, కేంద్రానికి 49% వాటా ఉన్నప్పటికీ సంస్థను నిర్వీర్యం చేసే విధానాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను వేలంతో సంబంధం లేకుండా సింగరేణికే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు బాయి బాట, భరోసా యాత్ర పేరుతో సింగరేణిలో యాత్రలు చేయడం వల్ల కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎం.ఎం.డి.ఆర్ చట్టంవల్లే సింగరేణికి బొగ్గు బ్లాకులు రావడం లేదని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం గుర్తించిన నాలుగు బొగ్గు బ్లాకులను బీజేపీకి, బొగ్గు గనుల శాఖ మంత్రికి చిత్తశుద్ధి ఉంటే వేలంలో ఉన్న వాటిని తొలగించి, తాడిచర్ల బ్లాక్2 ను ఎలా అలాట్ చేశారో అదే విధంగా ఈ నాలుగు గనులను కూడా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 31 డిమాండ్లతో యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వగా, ఇప్పటి వరకు రెండు విడతల చర్చలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. సమ్మె నోటీసు లో ప్రధాన డిమాండ్లు ఐన కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, 12వ వేతన సంఘం వెంటనే ఏర్పాటు చేయాలని, 4 లేబర్ కోడ్ల రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిల విడుదల చేయాలని, కార్మికుల నుండి రికవరీ చేసిన ఆదాయపన్ను రీయింబర్స్మెంట్ మారు పేర్ల సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డు కొనసాగింపు, సొంతింటి పథకం అమలు పై డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆగస్టు నెలలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి సమ్మె చేపడతామని ఆయన హెచ్చరించారు. అదే విధంగా రాజకీయాలకతీతంగా అందరం కలిసి సింగరేణిని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల కోసం, సంస్థ పరిరక్షణ కోసం ఏఐటియుసి ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం ఆయన చేశారు. ఈ సమావేశానికి ఏఐటియుసి ఓసిపి5 ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ అధ్యక్షత వహించారు. ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు మాట్లాడగా, నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, ఎడవెల్లి రాజిరెడ్డి, సదయ్య, ఉదయభాను, రవిందర్, నర్మద, అంజన్న, మడ్డి కిరణ్, పాపన్న, పరుశురాం, శ్రీనివాస్, సురేష్, పర్లపెల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



## రాజేశ్వరరావు పల్లె అసంపూర్తి రోడ్డుతో ప్రజల అవస్థలు

- పనులను అర్ధాంతరంగా వదిలివేసిన కాంట్రాక్టర్
- కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకున్న అధికారులు
- పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశంతో
- రూ. 8 కోట్లతో రీ ఎస్టిమేషన్ వేసిన అధికారులు

**ములుగు, జూలై 16, (డిడి9 వార్త) :**



ములుగు జిల్లా వెంకటాపురం మండలం రాజేశ్వరరావు పల్లె రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నర్సాపూర్ నుండి రాజేశ్వరరావు పల్లె వరకు బీటీ రోడ్డు ఏర్పాటు కోసం గత నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర పోసి పనులను అర్ధాంతరంగా వదిలివేశారు. అప్పటినుండి ఇప్పటివరకు ఆ రోడ్డు అలాగే ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్రసౌకర్యానికి గురవుతున్నారు. అయితే ఈ విషయాన్ని పంచాయతీరాజ్ డిఇ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి మాట్లాడుతూ.., గతంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలివేయడం జరిగిందని, ఈ విషయంపై ఆయనకు నోటీసులు ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడంతో పనులను టర్మినేట్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. తిరిగి పనులను చేపట్టేందుకు తాము చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశం మేరకు ములుగు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు నర్సాపూర్ నుండి రాజేశ్వరరావు పల్లి గ్రామం వరకు సుమారు ఐదున్నర కిలోమీటర్ల దూరం 18 ఫీట్లతో రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేసేందుకుగాను రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం నిధులు మంజూరు కాగానే టెండర్లు నిర్వహించి రోడ్డు పనులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే గ్రామానికి చెందిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, మత్స్య సహకార సంఘం చైర్మన్ దిలీప్ కుమార్ ముదిరాజ్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

## మంత్రి సీతక్కకి వినతిపత్రం అందజేసిన కామారం గ్రామ ప్రజలు.

- తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి గౌరవనీయులు సీతక్కకు కామారం గ్రామ ప్రజలు కలిసి గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త రిపోర్టర్)**

ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలోని కామారం గ్రామానికి అత్యంత అవసరమైన కళ్యాణ మండపం , హరిత హోటల్, అలాగే గ్రామ కంఠం భూముల సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజా సౌకర్యాల కల్పన మరియు భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి కామారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కోర్నిబెల్లి సావిత్రి ఉప సర్పంచ్ రేగా అనిల్ గ్రామ పెద్దలు పాయం కోటేశ్వరరావు రేగ ఆనంద్ మాజీ సర్పంచ్ కోర్నిబెల్లి లక్ష్మి నర్సయ్య , గ్రామ మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొని తమ గ్రామ అభివృద్ధిపై ఐకమత్యాన్ని చాటారు.

గ్రామ ప్రజల సమస్యలను ఓర్పుగా విన్న మంత్రి సీతక్క సంబంధిత అధికారులతో చర్చించి న్యాయమైన పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.



## యూత్ కాంగ్రెస్ నాయకులు జంగా వెంకటేష్ రెడ్డి కుమారుడి మొదటి జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారుడిని ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క

- తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త రిపోర్టర్)**

తాడ్వాయి మండలం , మేడారం ( రెడ్డిగూడెం) గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు జంగా సాయి రెడ్డి కుమారుడు యూత్ కాంగ్రెస్ నాయకులు జంగా వెంకటేష్ రెడ్డి నవీన కుమారుడు మోక్షిత్ సాయి రెడ్డి మొదటి జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారుడిని ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క మరియు తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ , జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , జిల్లా సీనియర్ నాయకులు ఎర్రబెల్లి మనోజ్ కుమార్ , జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి , తాడ్వాయి మండల అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి , మేడారం సర్పంచ్ పీరీల భారతి వెంకన్న , జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంత రెడ్డి , సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ , మండల ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర రావు , యూత్ నాయకులు జంగా సంతోష్ రెడ్డి సంగీత , మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు గౌడ్ , మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరెమ్ లచ్చు పటేల్ , జిల్లా కార్యదర్శి ఇర్ప సునీల్ దొర , సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య , మేడారం యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రానా రమేష్ , ఉపసర్పంచులు ఆలకుంట వనిత కృష్ణ , కట్కూరి భాస్కర్ రెడ్డి , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి సతీష్ కుమార్ , మండల నాయకులు తాలుక సంపత్ , నూనావత్ శ్రీను , గండికోట నారాయణ , సారయ్య , నార్లపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోలు సంజీవ రెడ్డి , తదితర నాయకులు పాల్గొన్నారు.



## సాగులో ఉన్న భూములలో కందకాలు తీయడం ఆపాలి

- ఆదివాసులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలి
- తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ములుగు జిల్లా కార్యదర్శి అధ్యక్షులు గొంది రాజేష్ దుగ్గి చిరంజీవి

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త రిపోర్టర్)**

పసర రేంజి ఆఫీస్ ముందు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోడు భూములలో కంధకాలు తీయడం ఆపాలని ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ములుగు జిల్లా కార్యదర్శి అధ్యక్షులు గొంది రాజేష్ దుగ్గి చిరంజీవి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పోడు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న ఆదివాసి భూములపై గత కొద్ది రోజుల నుండి ఫారెస్ట్ అధికారులు కందకాలు తీయడం దుర్మార్గమైన చర్య అని గత ప్రభుత్వ కాలంలో అటవీ హక్కుల పత్రాలు ఇస్తామని సర్వే చేయగా ఎస్టీ సర్టిఫికెట్లు లేని కారణంగా హక్కుపత్రాలు ఇవ్వడం ఆపివేశారు ఎలక్షన్ల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టాలు లేని పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కూడా వాటిని ఊసే లేకుండా నిమ్మకు నీరు ఎత్తనట్టుగా ఉన్నదే కాకుండా ఇప్పుడు ఫారెస్ట్ అధికారుల దాడులు గుంతలు తీయడానికి ప్రభుత్వం ముమ్మరం చేస్తున్నాయి ఇప్పటివరకు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా కూడా కొత్తది కొట్టం పాతది వదిలిపెట్టడం అనే నినాదంతో ఉన్నప్పటికీ కూడా సాగులో ఉన్న భూములలో కందకాలు తీయడం తీవ్రతరం చేస్తున్నారు ఇప్పుడు పంట వేసుకునే కాలం వచ్చినప్పటికీ విత్తనాలు చల్లుకునే సమయానికి భూములలో వ్యవసాయం చేయకుండా కందకాలు తీస్తూ ఆరైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వం మంత్రి సీతక్క స్పందించి వెంటనే సాగులో ఉన్న భూములలో కందకాలు తీయడం నిలిపివేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాము లేకపోతే సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరాటాలను ఉదృతం చేస్తాము ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అలెం అశోక్, గోనెపల్లి ఎలుబాక సార్లమ్మ గుంపు తక్కల్ల గూడెం కాల్వపల్లి ముసలమ్మ పేట మొండ్యాలతోగు ప్రజలు పాల్గొన్నారు.






## విద్యార్థి మృతి పై సమగ్ర విచారణ జరిపించాలి.

- డివైఎఫ్ఐ, పెద్దపల్లి జిల్లా కమిటీ డిమాండ్.

**డిడి9వార్త / రామగుండం జులై 17:**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లింగాపూర్ మోడల్ హైస్కూల్లో బుధవారం రోజు ప్రమాదవశాత్తు స్కూల్ వెనకాల నీటి గుంతలో పడి మృతి చెందిన 8వ తరగతి విద్యార్థి మృతి పై లోతైన సమగ్ర విచారణ నిష్పక్షపాతంగా జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) పెద్దపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తా ఉంది. బుధవారం రోజు బాలుడు మృతి చెందిన సంఘటన స్థలాన్ని జిల్లా కమిటీగా పరిశీలించటం జరిగిందని బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని జిల్లా కార్యదర్శి కొంటు సాగర్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రగిరి కృష్ణకుమార్, జిల్లా కమిటీ నాయకులు మొగిలిచర్ల సురేష్, సూర్య అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు మోడల్ స్కూల్ ల పైన ప్రత్యేక శ్రద్ధ వహించి అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నో సార్లు వేదికల పైన చెబుతూ ఉన్న ఆచరణలో మాత్రం విద్యార్థుల ప్రాణాలే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులు కనబడతా ఉన్నాయి. లింగాపూర్ మోడల్ స్కూల్ ఘటనలో కేవలం ప్రధాన ఉపాధ్యాయులనే సస్పెండ్ చేయడం కాదని సంబంధిత ఉన్నత అధికారుల మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు ప్రతి నెల తనిఖీలు చేస్తా ఉన్న కానీ ఇలాంటి అనుకోని సంఘటనలు జరగడం పైన తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అని వారి సందర్భంగా అన్నారు. పాఠశాల లోపల ప్రాంతంలోనే సీసీ కెమెరాలు ఉన్నాయి తప్ప స్కూలు పరిసర ప్రాంతాల లో సీసీ కెమెరా లేకపోవడం ఈ సంఘటనకు ప్రధాన కారణమని వారన్నారు. అంతే కాకుండా ఉన్నతాధికారులు ఏదో మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించారు తప్ప ఎప్పుడూ కూడా ఈ స్కూలు ప్రాంత పరిసరరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుని ఉంటే ఇటువంటి ఘటన జరిగి ఉండేది కాదని వారి సందర్భంగా అన్నారు. పాఠశాల ప్రహరీ గోడ పైన రక్షణ చర్యలు లేకపోవడం సంఘటనకు ఒక కారణమని వారన్నారు. స్కూలు వెనుక భాగంలో ఎవరో కొంతమంది వ్యక్తులు కొద్దికొద్దిగా అక్రమంగా మట్టిని తరలించకపోవడం తద్వారా అక్కడ పెద్ద గుంత ఏర్పడి అందులో వర్షపు నీరు నిలువ ఉండడం ద్వారా ప్రమాదవశాత్తు బాలుడు అందులో పడి మరణించడం జరిగిందని ఆ భూమి యొక్క ఎవరైతే సంబంధిత వ్యక్తులు ఉంటారో దాని చుట్టూ ఎటువంటి రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం కూడా కారణమని వారి మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా అన్నారు. కాబట్టి ఈ ఘటన పైన కేవలం స్కూలు యొక్క ప్రధాన ఉపాధ్యాయుల ఇద్దరినీ పైనే చర్యలు తీసుకోవడం కాకుండా స్థానిక కలెక్టర్, ఆర్డీవో,ఎమ్మెల్యే .లోతైన సమగ్ర విచారణ జరిపించి సంబంధిత ఉన్నత అధికారుల మీద ఆ భూమి యొక్క యజమాని పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు.



## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పెనాల్టీ విధానం రద్దు చేయాలి.

- కనీస వేతనం, సెలవులు, వైద్య సదుపాయం కల్పించాలి.
- సింగరేణి సి అండ్ ఎండి కి పంపిన లేఖ.
- ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్.

**డిడి9వార్త / రామగుండం జులై 17:**

సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సింగరేణి సి అండ్ ఎండికి లేఖ రాశారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో అరకొర వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, సెలవులు కూడా లేవని, ఆ కార్మికుడిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు కనీస వైద్య సదుపాయాలు కూడా లేవని ఆయన తెలిపారు.

ఏ కార్మికుడైనా అనారోగ్యం పాలై విధులకు గైర్హాజరయితే రోజుకు 300/ రూపాయల చొప్పున పెనాల్టీ విధించడం దుర్మార్గపు చర్య అని, దీనిని తక్షణమే సింగరేణి యాజమాన్యం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సింగరేణిలో సింగిల్ మెన్ టెండర్ కింద స్విమ్మింగ్ పూల్స్, లైబ్రరీ, పార్క్, హాస్పిటల్ తదితర విభాగాలలో పనిచేసే కార్మికులపై ఈ పెనాల్టీ విధానాన్ని అమలు చేయడం వల్ల ఆ కార్మికుడు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నాడని ఆయన పేర్కొన్నారు. వీరికి సంబంధించి కనీస వేతనాలు, సెలవులు అమలు చేయడంతో పాటు పెనాల్టీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఒకటవ క్యాటగిరి వేతనం అమలు చేస్తామని కోల్ ఇండియాలో ఒప్పుకొని 13 సంవత్సరాలు దాటినా ఇప్పటి వరకు అమలు కాకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఇప్పటికైనా 1వ క్యాటగిరి వేతనం అమలు చేసి, క్యాజువల్ లీవులు ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా సింగరేణి ఆస్పత్రులలో వైద్య సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సి అండ్ ఎండి కి రాసిన లేఖలో కోరారు.



# సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరియు సహచర మంత్రులు..

- **ఆత్మీయ స్వాగతం పలికిన స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూలై 16(డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్రం లోని ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి తలమానికమైన, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గ పరిధిలోని సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టును గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మరియు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరియు స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సంబంధిత ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు, మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, సీతమ్మ బ్యారేజి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల నాణ్యత, పురోగతి, లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, ప్రాజెక్టు పనులను నిర్ణీత గడువులో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన యంత్రాలు, సిబ్బంది, నిధులను సమన్వయం చేసుకొని వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు త్వరితగతిన సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.సీతారామ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వేలాది ఎకరాలకు శాశ్వత సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధికి, రైతుల ఆర్థిక పురోగతికి కీలకంగా మారనుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని మంత్రులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులతో పాటు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు,భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.







# రావినూతల గ్రామంలో యువకుల మధ్య ఘర్షణ... కౌంటర్ కేసులు నమోదు

- **ఒకరిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు**
- **అదే గ్రామానికి చెందిన మరో 12మందిపై కేసులు నమోదు**

**బోనకల్,జూలై 16,(డీడీ9 వార్త)**

మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన షేక్ చంద్ పాషా తండ్రీ మస్తాన్ వలి,అదే గ్రామానికి చెందిన రావినూతల తాళ్లూరి అభిరామ్ తండ్రీ రవిలు జూలై 11వ తేదీ శనివారం సాయంత్రం ఆవేశంలో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి తిట్టుకుంటూ చంద్ పాషా ఆవేశంలో అభినీ కొట్టాడనీ స్థానికులు పేర్కొన్నారు,అనంతరం అభి రావినూతల గ్రామానికి చెందిన వ్యక్తులు కలిసి చంద్ పాషా ను కొట్టినట్లు స్థానికులు తెలియజేశారు,ఆ తరువాత చంద్ పాషా ఇంటి వద్ద దాడికి కూడా ప్రయత్నం చేశారని అన్నారు,అనంతరం ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేసుకోగా,కులం పేరుతో దూషించాడనీ అభిరామ్ తల్లి నిర్మలా పిర్యాదు చేయగా ఏసిపి సాదుల సారంగపాణి విచారణ చేపట్టి షేక్ చంద్ పాషా పై క్రైమ్ నెంబర్ 127/2026 ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాచినేని రవి తెలిపారు అదే విధంగా షేక్ చాంద్ పాషా ఇచ్చిన ఫిర్యాదుపై రావినూతల గ్రామానికి చెందిన 12 మంది పై క్రైమ్ నెంబర్ 128/2026 నమోదు చేసినట్లు తెలిపారు ,ఈ సందర్భంగా ఎస్సై రవి మాట్లాడుతు అసాంఘిక కార్యక్రమాలు,చట్ట విరుద్ధ పనులు చేసే వారి కదలికల పై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని,అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం

**జనగామ జులై 16(డిడి 9 వార్త )బ్యూరో**

రఘునాథపల్లి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఇబ్రహీంపూర్ గ్రామంలో గ్రామ దేవతలు, బొడ్రాయి, మైసమ్మ తల్లికి ప్రత్యేక జలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామానికి మంచి వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింత నరేష్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి మంచి వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింత నరేష్, వార్డు సభ్యులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి: సర్పంచ్ నర్సింగ రామకృష్ణ

**జనగామ జులై 16(డిడి 9వార్త)బ్యూరో**

లింగాల ఘనపూర్ మండల పరిధిలోని నెల్లుట్ల గ్రామంలో వాసవి గ్రామైక్య సంఘం వార్షిక మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ నర్సింగ రామకృష్ణ మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, వార్డు సభ్యులు, వీఓఏ రేవతి, సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



# కంటి వెలుగుతో వేల కుటుంబాల్లో చిరునవ్వులు... భూక్య జంపన్న సేవలకు ప్రజల ప్రశంసలు

- **"30 వ విడత "కంటి శస్త్రచికిత్సలు విజయవంతం**
- **వృద్ధులు, పేదప్రజలను స్వగ్రామాలకు చేర్చిన భూక్య జంపన్న**

**డీ డీ 9 వార్త, ములుగు :**

కంటి వెలుగుతో వేల కుటుంబాల్లో చిరునవ్వులు నింపుతున్న బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు భూక్య జంపన్న. మరోసారి తన సేవా కార్యక్రమాలతో ప్రజల ప్రశంసలు అందుకున్నారు. పేదల ఆరోగ్యమే తన లక్ష్యమనే సంకల్పంతో ఆయన ఆధ్వర్యంలో జూలై 14న వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించిన 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఫలితాలు మరోసారి సేవాభావాన్ని చాటాయి.

ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు, వృద్ధులకు నిపుణులైన వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం ఆపరేషన్కు అర్హులైన 44 మంది ప్రజలను గుర్తించి, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సు ద్వారా తరలించి పూర్తిగా ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించారు.

ఆపరేషన్ విజయవంతంగా పూర్తికాగా, భూక్య జంపన్న స్వయంగా ఆసుపత్రికి వెళ్లి ఉచిత కంటి ఆపరేషన్ చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం గురువారం ప్రత్యేక వాహనాల్లో వారి స్వగ్రామాలకు సురక్షితంగా చేర్చే ఏర్పాట్లు చేసి, చివరి వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. వరుసగా 30 మెగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వేలాది మంది పేదలకు కంటి వెలుగును అందిస్తున్న భూక్య జంపన్న సేవా కార్యక్రమాలు జిల్లాలో విశేష ఆదరణ పొందుతున్నాయి. ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఆయన కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలపై లబ్ధిదారులు, ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. "పేద ప్రజలకు సేవే నా లక్ష్యం" అనే సంకల్పంతో ముందుకు సాగుతున్న భూక్య జంపన్న సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.



# ముందుగా స్థానిక రైతాంగానికే సాగునీరు అందించాలని..

- **బిఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా..**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు & పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు..**
- **మండల వ్యాప్తంగా బంద్ కు పిలుపునిచ్చిన బిఆర్ఎస్ పార్టీ.**




**మణుగూరు.జూలై 16(డి డి 9వార్త)**

గురువారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం లో ఉన్నటువంటి సీతమ్మ బ్యారేజ్ మరియు సీతారామ పంప్ హౌస్ ను సందర్శించడానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, తోటి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉత్తంకుమార్ రెడ్డి లకు శాంతియుతంగా వినతి పత్రాలు అందజేసి ముందుగా స్థానిక రైతులకు సాగునీరు ఇచ్చిన అనంతరం వేరే జిల్లాకు గోదావరి జలాలను తరలించాలని మంత్రులకు చెప్పుకునే అవకాశం లేకుండా ఆవేదనను అణిచివేసి బిఆర్ఎస్ పార్టీ నాయకులను మరియు సర్పంచ్ ఉప సర్పంచ్ లను ముందుగానే అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. రైతుల పక్షాన నిలబడి, వారి ప్రయోజనాల కోసం గళం విప్పి పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులను, ప్రజా ప్రతినిధులను నోరు నొక్కుతూ అక్రమంగా అరెస్టులు చేసి వేరే ప్రాంతాలకు తరలించిన పోలీసు యంత్రాంగం చర్యలను నిరసిస్తూ, శుక్రవారం (17.07.26) ఉదయం 9.00 గం నుంచి అశ్వాపురం మండలం వ్యాప్తంగా బంద్ కు పిలుపునివ్వడం జరుగుతుందని, కావున మండల చిరు వ్యాపారస్తులు,అన్ని వ్యాపార సంఘాలు,రైతుల పక్షాన వ్యాపారస్తులు నిలబడి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అశ్వాపురం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# మాజీ MLA మెచ్చా నాగేశ్వరరావు హౌస్ అరెస్ట్

- **పోలీసుల చాటున దాక్కుంటున్న పిరికి కాంగ్రెస్! రేవంత్ ది ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన!**
- **రైతులను ఎదుర్కొనే దమ్ము లేదా?**
- **దమ్మపేట, అశ్వరావుపేట, మండలం ముఖ్య నాయకులను అరెస్టు చేసిన పోలీసులు...**




**అశ్వరావుపేట:జూలై 16(డి డి 9 వార్త)**

రైతుల సమస్యలపై నిలదీస్తారన్న భయంతో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా BRS అధ్యక్షులు రేగ కాంతారావు గారి పిలుపుమేరకు నిరసనకు సిద్ధమైన అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ MLA, BRS పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు గారిని దమ్మపేట(మండలం), తాటిసుబ్బన్నగూడెం (గ్రామం)లోని వారి నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్యేనని.

ఉప ముఖ్యమంత్రితో సహా మంత్రుల దండు మణుగూరు వస్తుంటే, రైతుల సమస్యలపై ప్రశ్నిస్తారనే వణుకు ఎందుకు పట్టుకుందని. అధికారంలోకి రాకముందు ఆకాశం నుంచి అమృతం తెస్తామన్న కాంగ్రెస్ నాయకులు, తీరా గద్దెనెక్కాక రైతుల కష్టాలు అడిగితే పోలీసులతో అరెస్టులు చేయిస్తారా? అంటూ విరుచుకుపడ్డారు. ఓట్లు వేసిన పాపానికి ప్రజలకు మీరు ఇస్తున్న బహుమతి జైలు శిక్షలా?ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజ్యాంగంపై కంటే లాఠీలపైనే నమ్మకం ఎక్కువైనట్లుందని.పోలీసులను అడ్డుపెట్టుకుని పాలించడానికి నువ్వు ముఖ్యమంత్రివా? లేక నియంతవా రేవంత్ రెడ్డి? అంటూ ప్రశ్నించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయమని అడగడం తప్పైతే.. ఆ తప్పును బీఆర్ఎస్ పార్టీ చేస్తూనే ఉంటుందని .కేసులు పెట్టి, అక్రమ అరెస్టులు చేసి తెలంగాణ ఉద్యమకారుల గొంతు నొక్కొచ్చు అనుకోవడం రేవంత్ రెడ్డి మూర్ఖత్వంమని.మీ చేతకాని పాలనను కప్పిపుచ్చుకోవడానికే ఈ దిక్కుమాల్ని చర్యలకు పాల్పడుతున్నారని.ఎన్ని అరెస్టులు చేసిన ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని.2సం.లో మళ్ళీ తిరిగి అధికారంలోకి వచ్చాక ప్రతి ఒకరికి సమాధానం కూడా ఇస్తామని.ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు.

అరెస్ట్ అయిన వారిలో దమ్మపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు సోయం వీరభద్రం, హౌస్ అరెస్ట్ చేసినారు

అశ్వరావుపేట మండలం బిఆర్ఎస్ మాజీమండల అధ్యక్షులు జుజ్జురి .వెంకన్న బాబు, మాజీ ఎంపీపీ శ్రీరామ్ మూర్తి, సీనియర్ నాయకులు యూఎస్ ప్రకాష్ రావు, మోహన్ రెడ్డి, టౌన్ మాజీ అధ్యక్షులు సంపూర్ణ , మోటూరు మోహన్, కాసాని చంద్రమోహన్, తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

# మారుజోడు రాంబాబు జన్మదిన వేడుకలు ఘనంగా

**జనగామ జులై 16(డిడి 9 వార్త)బ్యూరో**

రఘునాథపల్లి మండలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ మండల పార్టీ, రాంబాబు యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ప్రజాసేవలో కొనసాగుతున్న రాంబాబు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జగదీష్ చందర్ రెడ్డి, రఘునాథపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.





## చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...

**అశ్వరావుపేట:జులై16 (డిడి 9 వార్త)**

ఉమ్మడి జిల్లా పరిధిలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు,పనుల పురోగతిని గౌరవ ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క *, సాగునీటి పారుదల శాఖ మంత్రివర్యులు *శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు *శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి * తో కలిసి స్థానిక శాసనసభ్యులు శ్రీ *జారె ఆదినారాయణ * ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు పనులపై అధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... గోదావరి జలాలను గ్రావిటీ మరియు లిఫ్ట్ విధానాల ద్వారా గరిష్టంగా వినియోగంలోకి తీసుకు వచ్చి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీతారామ ప్రాజెక్టును సమగ్రంగా సమీక్షించి, ఇప్పటికే జరిగిన పనులు వృథా కాకుండా అవసరమైన సాంకేతిక మార్పులతో వేగంగా పూర్తి చేసే దిశగా నిరంతర కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ప్రజల పన్నుల రూపంలో వచ్చే ప్రతి పైసా ప్రజా ధనాన్ని జాగ్రత్తగా వినియోగిస్తూ, ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు, లింక్ కెనాల్స్, టన్నెల్స్ నిర్మాణంతో వైరా, పాలేరు రిజర్వాయర్లను అనుసంధానిస్తూ సత్తుపల్లి వరకు సాగునీరు అందేలా పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు నెలవారీ కార్యాచరణ ప్రణాళికతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యేలు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు....

## ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్.. యువకుడి పరిస్థితి విషమం..

**మణుగూరు.జూలై 16(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లో గురువారం నాడు మంత్రుల పర్యటన నేపథ్యంలో మణుగూరు మండలం తోగూడెం సమ్మక్క-సారలమ్మ ఆలయం సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా ఈ బయ్యారానికి చెందిన బాలాజీ ఫ్లెక్సీ షాప్ నిర్వాహకుడు సిరిగడ్డే సంతోష్ విద్యుత్ షాక్‌కు గురైనట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెంలోని నాగరాజు ఆస్పత్రికి తరలించగా, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవలే ఆయన తండ్రి కృష్ణమూర్తి మృతి చెందగా, ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 16(డీడీ9 వార్త):**

మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పి.ఆర్.సి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు చెందాల్సిన ఆరు నెలల పి.ఆర్.సి బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. వీటితో పాటు కార్మికులకు అవసరమైన పనిముట్లు అందించాలని, పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ సమస్యలను పరిష్కరించాలని, మరణించిన మరియు పదవీ విరమణ చేసిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. మూడు నెలల పి.ఆర్.సి బకాయిలను తక్షణమే చెల్లిస్తామని, మిగిలిన మూడు నెలల బకాయిలను వచ్చే నెలలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మరణించిన, రిటైర్మెంట్ అయిన కార్మికుల వారసుల నియామకంపై ఉన్నతాధికారులతో చర్చించి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు బి. మల్లేష్, కార్మిక ప్రతినిధులు కే. గంగమని, బి. సాయమ్మ, ఎం. అబ్బయ్య, సరోజన, నాగమణి, గంగామణి, అబ్బవ్వ, పోసాని, రాణి, కార్మికులు పాల్గొన్నారు.



# సెల్ టవర్ తో ఫియర్

- జనావాసాల మధ్యలో సెల్ టవర్ నిర్మాణాలు.. అవసరం లేదా? స్థానికుల అభిప్రాయాలు
- కోట్లల్లో టర్నోవర్ పొందుతున్న కార్పొరేట్ కంపెనీలు.. అనారోగ్యం పాలవుతున్న ఏజెన్సీ వాసులు
- సామర్థ్యానికి మించి ఫ్రీక్వెన్సీ పెంచి సిగ్నల్లు.. తట్టుకోలేక విద్యుత్ మీటర్ల పేలుళ్లు
- ధైర్య సాహసాలు ప్రదర్శించి మంటలను అదుపు చేసిన యువకుడు.. అందుకున్నాడు ప్రజల ప్రశంసలు
- అగ్ని ప్రమాదాలు తరచూ సంభవించడానికి కారణం కాంట్రాక్టర్లు.. కాసులకు కక్కుర్తి పడి మార్చుకుంటున్నారు క్యారెక్టర్లు
- ప్రశ్నిస్తే మీరేం చేసుకుంటారో చేసుకోండని బెదిరింపులు.. ఏజెన్సీ పై వీరి పెత్తనం ఏమిటని వాపోతున్న స్థానికులు
- హడావిడిగా విద్యుత్ మీటర్ కు ఆన్లైన్ దరఖాస్తు.. పొందుతున్నారు విద్యుత్ శాఖ అధికారులను బెదిరిస్తూ
- తొలగించాలి సేఫ్టీ, సెక్యూరిటీ లేని టవర్లను తక్షణం.. ప్రజల ప్రాణాలకు కల్పించాలి రక్షణ
- ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్న సెల్ టవర్ నిర్వాహకులు.. ఇకపై ఉపేక్షించేది లేదంటున్న స్థానిక ప్రజలు
- సెల్ టవర్ తొలగించే దిశగా ఆలోచించాలి అధికారులు.. ప్రజల ప్రాణాలను కాపాడాలని వినతులు

**చర్ల, జూలై 16 (డిడి 9 వార్త )**



ఏజెన్సీలోని ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన గ్రామీణ వాతావరణం కలుషితం చేస్తూ విషపూరితంగా మార్చాలని కంకణం కట్టుకున్నాయి కొన్ని అగ్రసంస్థల కంపెనీలు. అగ్రస్థాయి కంపెనీలతో పోటీపడి మార్కెట్లో నిలదొక్కుకోవడానికి అధికారులకు డబ్బు ఆశ చూపి వారిని అవినీతి పరులుగా మార్చి వారికి కావలసిన అనుమతులను అక్రమంగా అడ్డదారిలో పొందుతూ ఆధిపత్యం చలాయిస్తున్నాయి కంపెనీలు. ఏజెన్సీని వారి ఆధీనంలోకి తీసుకొని అమాయక ప్రజల ఆరోగ్యంతో, ఆయుషుతో ఆటలాడుతున్నాయి కార్పొరేటు కంపెనీలు. ఏజెన్సీలోని చట్టాలను నిర్వీర్యం చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించి స్థానికుల అనుమతులు పొందకుండానే, ఎటువంటి గ్రామ సభలు నిర్వహించకుండానే అధికారుల సహకారంతో కొంతమందికి లాభం చేకూరేలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఆరోగ్యాన్ని దెబ్బతీసి క్యాన్సర్ వ్యాధి బారిన పడేలా చేసే సెల్ టవర్ నిర్మాణాలకు యథేచ్ఛగా అనుమతులను పొందుతూ అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అక్రమ కట్టడాలకు అనుమతులిస్తూ ఏజెన్సీ గడ్డను క్యాన్సర్ కు అడ్డాగా మార్చిన అతిశయోక్తి ఏమి కాదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గల హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్.పి) పెట్రోల్ బంక్ ప్రక్కనే, అయ్యప్ప హోటల్ వెనుక నూతనంగా నిర్మించిన సెల్ టవర్ కు విద్యుత్ సరఫరా కొరకు ఇచ్చిన విద్యుత్ మీటర్ లో బుధవారం సుమారు రాత్రి పది గంటల సమయంలో అకస్మాత్తుగా పెద్ద శబ్దాలతో భారీ పేలుడు సంభవించి విద్యుత్ మీటర్ పూర్తిగా దగ్ధమై పెద్ద మంటలు వ్యాపించాయి ఆ శబ్దాలు విన్న స్థానికులు, ఆ టవర్ ని ఆనుకొని ఉన్న భవనంలో అద్దెకు ఉండేవారు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసిపడుతున్న జ్వాలలను చూసి భయభ్రాంతులయ్యారు. సెల్ టవర్ కు అతి సమీపంలో హెచ్. పి పెట్రోల్ బంక్ ఉండడం వలన ఆ పేలుళ్ల కారణంగా పెట్రోల్ బంకుకు ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని భావించి ఆ బంకులో పనిచేసే ఒక యువకుడు వెంటనే స్పందించి ధైర్యంగా మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో పెట్రోల్ బంకులో ఎవరు లేకపోయి ఉంటే, ఒకవేళ అర్ధ రాత్రి ఈ ప్రమాదం సంభవించి వుండి ఉంటే, విద్యుత్ మీటర్ నుండి వ్యాపించిన మంటలు వెనుక ఉన్న బ్యాటరీ చాంబర్ కు పక్కనే ఉన్న సిగ్నల్ చాంబర్ కు అంటుకొని ఉంటే భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించేదని, అది ఊహించుకుంటేనే భయంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదానికి ప్రధాన కారణం భద్రతా చర్యలు తీసుకోకపోవడం, కనీస రక్షణ కల్పించకపోవడమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగి ఒకరోజు గడిచిన సెల్ టవర్ కు తన ఇంటి స్థలాన్ని లీజుకు ఇచ్చిన ఇంటి యజమాని కనీసం స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. ఈ మేరకు గురువారం ఉదయం స్థానికులు సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించిన తక్షణమే వారు స్పందించి ప్రమాదం సంభవించిన ప్రదేశానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు భద్రత, రక్షణ చర్యలను గురించి సెల్ టవర్ కంపెనీకి సంబంధించిన భద్రాచలం ఏరియా కాంట్రాక్టర్ ను ఫోన్ ద్వారా వివరణ అడుగగా ప్రత్యేకంగా సెక్యూరిటీ, సేఫ్టీ ఏ టవర్ వద్ద ఉండదని ఈ విషయంలో స్థానిక తహశీల్దార్ కు గాని, ఉన్నత అధికారులకు గాని, వార్త పత్రికలకు గాని, మరెవ్వరికైనా గాని ఫిర్యాదు చేసిన మాకెలాంటి భయం లేదని దురుసుగా సమాధానం ఇస్తున్నారని, ప్రజల ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టవర్ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేయాలని కోరుకుంటున్నారు. జనావాసాల మధ్యలో సెల్ టవర్ నిర్మాణాలు ఏంటని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిసి కూడా కొందరు వ్యాపారులు వారి స్వప్రయోజనాల కోసం అదనపు ఆదాయం కోసం నిర్మాణాలను ఆపకుండా చీకటి ఒప్పందాలు చేసుకొని అడ్డగోలు అనుమతులిస్తు అగ్ర సంస్థల కంపెనీలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, టవర్ ను పూర్తిగా తొలగించాలని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

## బాన్సువాడలో ప్రత్యేక యూడీఐడీ (సదరం) క్యాంపు ప్రారంభం

- ప్రతి నెల రెండు సార్లు దివ్యాంగులకు స్థానికంగానే సేవలు

**బాన్సువాడ, జూలై 16(డిడి9 వార్త):**

బాన్సువాడ డివిజన్‌కు చెందిన శారీరక దివ్యాంగులకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే యూడీఐడీ (సదరం) సేవలు అందించేందుకు ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేశారు.ఈ క్యాంపును బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సంయుక్తంగా ప్రారంభించారు. క్యాంపులో భాగంగా నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తైంది. ఈ సందర్భంగా దివ్యాంగుల నమోదు, వైద్య పరీక్షలు, మూల్యాంకనం తదితర ప్రక్రియలను అధికారులు సజావుగా నిర్వహించారు.ఈ ప్రత్యేక యూడీఐడీ (సదరం) క్యాంపులు ఇకపై ప్రతి నెల రెండు సార్లు బాన్సువాడ డివిజన్‌లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డివిజన్ పరిధిలోని శారీరక దివ్యాంగులు తమ ప్రాంతంలోనే సులభంగా యూడీఐడీ కార్డుకు సంబంధించిన సేవలను పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బందికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), కామారెడ్డి జిల్లా తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సమీక్ష

**కామారెడ్డి బ్యూరో, జూలై 16(డిడి9 వార్త):**

హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతిపై ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలనే లక్ష్యంతో గత మే 23, 2026న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముంపు ప్రభావిత భూములకు నష్టపరిహారం చెల్లించి అవసరమైన అనుమతులు పొందేందుకు రూ.55.30 కోట్లను మంజూరు చేయగా, ఇందుకు సంబంధించిన జి.ఓ. నెం.37ను జూన్ 8, 2026న ప్రభుత్వం జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేందుకు అటవీ శాఖ పీసీసీఎఫ్ (నోడల్ ఆఫీసర్) శ్రావణ్, ఇరిగేషన్ ఈఎన్‌సీ శ్రీనివాస్, కామారెడ్డి ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ దక్షిణామూర్తి, బాన్సువాడ ఈఈ రాజశేఖర్ తదితర అధికారులతో పోచారం శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పూర్తయితే బాన్సువాడ నియోజకవర్గంలోని సాగునీటి అవసరాలు మెరుగుపడటంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.





## పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ..

- పారిశుధ్యంపై సిబ్బందికి పలు సూచనలు చేసిన కమిషనర్.

**మణుగూరు.జూలై 16(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శ్రీ నగర్ లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పరిసరాల పరిశుభ్రత పై పలు సూచనలు చేశారు.డ్రైనేజీలను క్షుణ్ణంగా పరిశీలించి మురుగు నీరు, వరద నీరు ఎక్కడెక్కడ ఆగుతున్నాయో గుర్తించారు. వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ ను ఆదేశించారు.మూలమలుపుల వద్ద రాత్రి వేళల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రమాదకర కల్వర్టుల వద్ద ఇరువైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాలనీ లోని ప్రజలకు కూడా ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత,పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించారు. ఇంటిలోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ పాడవేయరాదని ,అలాచేస్తే దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తమ వీధులను, కాలనీలను శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీ బోథ్ ఇన్చార్జిగా మాజీ ఎమ్మెల్యేరాథోడ్ బాపూరావు నియామకం

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డీడీ 9 వార్త)**

బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు. తెలంగాణ రక్షణ సేన పార్టీ. బోథ్ ఇన్చార్జిగా. ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. అధికారికంగా నియమించినందుకు. తలమడుగు మండలంలోని టీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు.నిమ్మల గజానన్. గడుగు పోచన్న. శాస్త్రి స్వామిలు కలిసి. రాథోడ్ బాపురావుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా. పార్టీ ముఖ్య నాయకుడు నిమ్మల గజానన్ మాట్లాడుతూ పార్టీ పట్ల. సరైన అంకితభావంతో పనిచేసిన. రాథోడ్ బాపురావుకు. పార్టీ బాధ్యతలు. అప్పగించినందుకు. తల్లమడుగు మండల TRS. పార్టీ కార్యకర్తల తరపున. మరియు నాయకుల తరపున. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ధన్యవాదాలు తెలిపారు.రాథోడ్ బాపూరావు ఆధ్వర్యంలో. సైనికుల పనిచేసే .పార్టీ బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు





## పుష్కర ఘాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా జూలై 16(డీడీ9 వార్త):**

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు మెరుగైన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య గురువారం మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచంపాడ్, పుష్కర ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఘాట్ల వద్ద భక్తుల రాకపోకలకు అనువైన మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు, వాకింగ్ ట్రాక్‌లు మరియు హెలిప్యాడ్ స్థలాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, తాత్కాలిక పోలీస్ సహాయ కేంద్రాల పని తీరుపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. పుష్కరాల సమయంలో వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం మరియు అత్యవసర స్పందన బృందాల ఏర్పాటుపై ముందస్తు కార్యాచరణ చేపట్టాలని పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి, రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని, ఇరిగేషన్ శాఖ డీఈ సురేష్, ఏఈలు సుశాంత్ కుమార్, వంశీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగిద్దాం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 16(డీడీ9 వార్త):**

విప్లవ పోరాటయోధుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనకై కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ పేర్కొన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న పార్టీ జెండా గద్దె వద్ద కామ్రేడ్ చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లి చంద్రశేఖర్ విప్లవ ప్రస్థానాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన తన పెదనాన్న వెంకటనారాయణ, సోదరుడు సుభాష్ చంద్రబోస్ ల స్ఫూర్తితో నూతన ప్రజాస్వామ్య విప్లవానికి ఆయన అంకితమయ్యారని తెలిపారు. ఖమ్మం రైతు కూలీ సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను ఆయన క్రమశిక్షణతో నిర్వర్తించారని కొనియాడారు. ఉత్తర భారత దేశంలో పర్యటిస్తూ, ఢిల్లీ రైతాంగ పోరాటంలో చురుగ్గా పాల్గొన్న ఆయన, పార్టీలో ఎల్లప్పుడూ ప్రజా పంథా వైపే నిలబడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, ధ్యాకం పోశెట్టి, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, లక్ష్మి, పద్మ, సావిత్రి, పోసాని, రాజమణి, అనసూయ, రమ, సుశీల, గంగామణి, సిహెచ్. రమేష్, రాములు, ఎస్.కె. పాషా, ఖాజా, గంగారం, చిన్నయ్య, శంకర్, సురేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## రేపు కలెక్టర్ కార్యాలయంలో దిశ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

- **మీడియా ప్రతినిధులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆహ్వానం**

**కామారెడ్డి బ్యూరో, జూలై 16(డిడి9 వార్త):**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం దిశ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశాన్ని కవర్ చేసేందుకు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కోరారు.







# కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- **156 బైక్స్, 2 ఆటోలు, 8 కార్లు, బొలెరో వాహనాలు స్వాధీనం.**
- **అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు**
- **ప్రజల సంరక్షణ, భద్రతకై కమ్యూనిటీ కాంటాక్ట్ ల నిర్వహణ**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.**

**అదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగానిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ లను నిర్వహించడంజరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామం నందు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు 120 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువ పత్రాలు లేనటువంటి 156 ద్విచక్ర వాహనాలు, 2 ఆటో లను, 8 కార్లు, బొలెరో లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, నెంబర్ ప్లేట్ లేని 3 వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్రమంగా కల్తీ కల్లు తయారు చేయడానికి ఉపయోగపడే ముడి సరుకు అమ్మోనియం బైకార్బోనేట్ ఒక క్వింటల్ వరకు స్వాధీనం చేసుకొని నిందితుడు సురేందర్ గౌడ్ పై కేసు నమోదు చేస్తున్నట్లు , అదేవిధంగా అక్రమ మద్యం అనుమతులు లేకుండా విక్రయిస్తున్న పి శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి వద్ద దాదాపు 200 బాటిల్ల మద్యం లభించినట్లు అతనిపై ఇచ్చిన పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సక్రమంగా జీవించాలని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దొంగతనాలు, దోపిడీలు చేయకుండా, సత్ప్రవర్తనతో మెదలాలను తెలిపారు. గొడవలకు దారి తీసేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వీడిసి అక్రమాలు, బలవంతపు వసూళ్లు, నంబర్ ప్లేట్లు లేకుండా తిరగడం, దొంగ వాహనాలను కొనుగోలు చేయడం లాంటివి చేయవద్దని తెలిపారు.



ఇదివరకే కేసులలో నమోదైన వారిపై సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్స్ ఓపెన్ చేయడం జరిగిందని, మిగిలిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజలు నేరాలు చేసే వారి సమాచారం 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటినుండి చదువుపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యం పై దృష్టి సారించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సక్రమంగా వాహనాలను నడుపుతూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ఎన్ వెంకట నరసయ్య, ఎ ఆర్ డిఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సిఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి,టి మురళి, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

- **ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ లక్ష్యాలు పూర్తి చేయాలి – జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి బ్యూరో, జూలై 16(డిడి9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్రాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్య, వాతావరణ పరిస్థితులు, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల మార్పిడి చేసుకునేలా చర్యలు చేపట్టాలని, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఐడీఓసీ నుంచి పాల్గొనగా, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎల్ నినో ప్రభావంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే మెట్టపంటలు, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతువేదికల ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో విద్యార్థుల నమోదు లక్ష్యాలను నిర్దేశిత




గడువులో పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అలాగే పాఠశాలల పరిసరాల్లో దోమల వ్యాప్తి నివారణకు గ్రామ పంచాయతీల ద్వారా చెత్తాచెదారం తొలగించి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో 9 నాటు తుపాకుల స్వాధీనం

- **10 మంది నిందితుల అరెస్టు**

**నిజామాబాద్ జిల్లా జూలై 16(డీడీ9 వార్త):**

భీమ్‌గల్ మండలం దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో నాటు తుపాకులతో సంచరిస్తున్న పదిమంది వ్యక్తులను సీసీఎస్, భీమ్‌గల్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా గురువారం తెల్లవారుజామున అడవిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 9 నాటు తుపాకులు బయటపడ్డాయి. వీటికి ఎలాంటి లైసెన్సులు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నాటు తుపాకులను రిపేర్ చేసే మరో వ్యక్తి రాజుతో సహా మొత్తం పదిమందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు అడవి జంతువులను వేటాడేందుకు వీటిని ఉపయోగిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇటీవల దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో చిరుతపులి మృతి చెందిన ఘటన నేపథ్యంలో పోలీసులు, అటవీ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపడుతుండటంతో భయపడిన నిందితులు తమ వద్ద ఉన్న అక్రమ తుపాకులను అడవిలో దాచిపెట్టేందుకు తరలిస్తుండగా పోలీసులకు దొరికిపోయారు. ఈ కేసులో భూక్యా రఘుపతి, కార్ల అంజయ్య, ముదావత్ తిరుపతి, భూక్యా చందర్, ముర్రి గంగ నర్సయ్య, అనిమేని లింబాద్రి, మాలావత్ కుంభ, బానావత్ గంగారెడ్డి, మాలావత్ ధారి సింగ్, అకునూర్ రాజులను అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అక్రమ ఆయుధాలను కలిగి ఉండటం, తరలించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి




కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని భీమ్‌గల్ పోలీసులు కోరారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఏసీపీ పి.శ్రీశైలం, ఆర్మూర్ ఏసీపీ జె.వెంకటేశ్వరరెడ్డి, సీఐలు సురేష్, పి.సత్యనారాయణ గౌడ్, సాయినాథ్, ఎస్సై తిరుపతి మరియు సిబ్బందిని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అభినందించారు.








# జపాన్ ఓపెన్‌లో సింధు జోరు.. ప్రపంచ నంబర్-5కు షాక్!

- జపాన్ ఓపెన్‌లో హాన్ యూయేపై సింధు 21-16, 21-14తో విజయం
- కేవలం 35 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన భారత స్టార్ షట్లర్
- హాన్ యూయేపై హెడ్ టు హెడ్ రికార్డును 8-1కు పెంచుకున్న సింధు
- క్వార్టర్ ఫైనల్లో నొజోమీ ఒకుహారాతో సింధు పోటీ
- మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్-తనీషా జోడీ నిష్క్రమణ

**డిడి9 వార్త:**

భారత్ స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూయే (చైనా)పై వరుస గేమ్‌లలో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ విజయంతో టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచిన ఏకైక క్రీడాకారిణిగా నిలిచింది. ప్రారంభంలో ఇద్దరి మధ్య హోరాహోరీ పోటీ కనిపించింది. హాన్ యూయే మ్యాచ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేసినా సింధు క్రమంగా లయ అందుకుంది. కచ్చితమైన షాట్లు, దూకుడు ఆటతో ర్యాలీలపై ఆధిపత్యం చెలాయించింది. తొలి గేమ్‌ను 2116తో సొంతం చేసుకుని మ్యాచ్‌లో పైచేయి సాధించింది.

రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి 80 ఆధిక్యంలోకి వెళ్లింది. హాన్ యూయే కొంత పోరాడినా సింధు ఏమాత్రం తడబడలేదు. చివరకు 21 14తో రెండో గేమ్‌ను కూడా గెలిచి కేవలం 35 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. హాన్ యూయేపై సింధు హెడ్ టు హెడ్ రికార్డు 81కు చేరింది.ప్రపంచ పదో ర్యాంకర్‌గా ఉన్న సింధు క్వార్టర్ ఫైనల్లో జపాన్ మాజీ ప్రపంచ ఛాంపియన్ నొజోమీ ఒకుహారాతో తలపడనుంది. ప్రపంచ నంబర్ వన్ అన్ సె యంగ్ రెండో రౌండ్ నుంచి వైదొలగడంతో ఒకుహారా క్వార్టర్‌కు చేరుకుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలాతనీషా క్రాస్టో జోడీ ఓటమితో నిష్క్రమించగా, లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి, ఉన్నతి హూడా ఇప్పటికే తొలి రౌండ్‌లోనే టోర్నీ నుంచి నిష్క్రమించారు.

# టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర.. మేజర్ లీగ్ క్రికెట్‌లో వరల్డ్ రికార్డ్స్ బద్దలు

- ఎంఎల్‌సీ ఎలిమినేటర్‌లో ఎంఐ న్యూయార్క్‌పై వాషింగ్టన్ ఫ్రీడమ్ ఘన విజయం
- టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ప్రపంచ రికార్డు
- విధ్వంసక సెంచరీలతో కదం తొక్కిన స్టీవ్ స్మిత్, ఆండ్రీస్ గౌస్
- పూరన్ ఫాస్టెస్ట్ సెంచరీ, పొలార్డ్ 1000 సిక్సర్ల మైలురాయి వృథా
- ఛాలెంజర్ మ్యాచ్‌లో శాన్‌ఫ్రాన్సిస్కోతో తలపడనున్న వాషింగ్టన్


**డిడి9 వార్త:**

మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) 2026 సీజన్‌లో పరుగుల సునామీ సృష్టించిన వాషింగ్టన్ ఫ్రీడమ్, టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (110 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో డిఫెండింగ్ ఛాంపియన్ ఎంఐ న్యూయార్క్‌పై 6 వికెట్ల తేడాతో వాషింగ్టన్ చారిత్రక విజయం సాధించింది. ఈ గెలుపుతో వాషింగ్టన్ జట్టు ఛాలెంజర్ మ్యాచ్‌కు అర్హత సాధించింది.

ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్, నికోలస్ పూరన్ (31 బంతుల్లో 100) మెరుపు సెంచరీతో నిర్ణీత ఓవర్లలో 266 పరుగుల భారీ స్కోరు సాధించింది. పూరన్ ఎంఎల్‌సీ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అతనికి తోడుగా కీరన్ పొలార్డ్ (25 బంతుల్లో 64) కూడా సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ క్రమంలో పొలార్డ్ టీ20 క్రికెట్‌లో 1,000 సిక్సర్లు కొట్టిన రెండో ఆటగాడిగా (క్రిస్ గేల్ తర్వాత) రికార్డు సృష్టించాడు.

267 పరుగుల అసాధ్యమనుకున్న లక్ష్యంతో బరిలోకి దిగిన వాషింగ్టన్ ఫ్రీడమ్, ఆరంభంలో 10 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన స్టీవ్ స్మిత్, వికెట్ కీపర్ ఆండ్రీస్ గౌస్ (51 బంతుల్లో 132) కలిసి విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 241 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. కేవలం 48 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 110 పరుగులు చేసిన స్మిత్ అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. దీంతో వాషింగ్టన్ 18.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పటివరకు టీ20ల్లో అత్యధిక ఛేదన రికార్డు (265) ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ పేరిట ఉండేది. ఇప్పుడు వాషింగ్టన్ ఆ రికార్డును బద్దలుకొట్టింది.

గతేడాది ఫైనల్‌లో ఎంఐ న్యూయార్క్ చేతిలో ఓటమి పాలైన వాషింగ్టన్, ఈ విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. ఇవాళ జరిగే ఛాలెంజర్ మ్యాచ్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్, శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్‌తో తలపడుతుంది. ఇందులో గెలిచిన జట్టు ఈ నెల 18న జరిగే ఫైనల్‌లో లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్‌ను ఢీకొంటుంది.





# భారత పేసర్ గుర్నూర్ బ్రార్‌కు డీమెరిట్ పాయింట్.. ఐసీసీ సీరియస్ వార్నింగ్!

- ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద ఒక డీమెరిట్ పాయింట్ నమోదు
- ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో బ్యాటర్ వైపు బంతి విసిరిన ఘటన
- తప్పును అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్ష ఖరారు
- రెండేళ్ల కాలంలో గుర్నూర్‌కు ఇదే తొలి తప్పిదం



**డిడి9 వార్త:**

భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ సింగ్ బ్రార్‌పై ఐసీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడికి అధికారికంగా హెచ్చరిక జారీ చేయడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను రికార్డుల్లో నమోదు చేసింది. ఈ మేరకు ఐసీసీ నేడు ఒక ప్రకటన విడుదల చేసింది.వివరాల్లోకి వెళితే.. ఈ నెల 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 8వ ఓవర్లో బౌలింగ్ చేస్తున్న గుర్నూర్ బ్రార్, బంతిని అందుకుని బ్యాటర్ వైపు అనుచితంగా, ప్రమాదకరంగా విసిరాడు. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. 'అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారుడిపై లేదా సమీపంలోకి అనుచితంగా, ప్రమాదకరంగా బంతిని విసరడం' ఈ నిబంధన పరిధిలోకి వస్తుంది.

ఈ ఆరోపణలను ఆన్‌ఫీల్డ్ అంపైర్లు కుమార్ ధర్మసేన, మైక్ బర్న్స్, థర్డ్ అంపైర్ శామ్ నొగాజ్‌స్కీ, ఫోర్త్ అంపైర్ రస్సెల్ వారెన్ మోపారు. అయితే, గుర్నూర్ బ్రార్ తన తప్పును అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ప్రతిపాదించిన శిక్షకు అంగీకారం తెలపడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే శిక్షను ఖరారు చేశారు. గత 24 నెలల కాలంలో గుర్నూర్‌కు ఇదే మొదటి తప్పిదం కావడం గమనార్హం.

లెవల్ 1 ఉల్లంఘనలకు సాధారణంగా అధికారిక హెచ్చరిక నుంచి ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఒక ఆటగాడి ఖాతాలో 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు చేరితే, వాటిని సస్పెన్షన్ పాయింట్లుగా మార్చి నిషేధం విధిస్తారు. రెండు సస్పెన్షన్ పాయింట్లు ఒక టెస్టు లేదా రెండు వన్డేలు/టీ20ల నిషేధానికి సమానం. కాగా, ఈ సిరీస్‌లో తొలి వన్డేను 6 వికెట్ల తేడాతో గెలిచిన భారత్ 10 ఆధిక్యంలో ఉంది. నేడు కార్డిఫ్‌లో ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరగనుంది.

# విరాట్ కోహ్లీ సక్సెస్ రహస్యం అదే.. ఆసక్తికర విషయం చెప్పిన అభిషేక్ నాయర్

- కోహ్లీ విజయ రహస్యాన్ని బయటపెట్టిన మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్
- ఆస్ట్రేలియాలో కోహ్లీ ఫామ్‌లో లేనప్పుడు జరిగిన సంభాషణను గుర్తుచేసుకున్న వైనం
- తాను టెక్నికల్ సలహా ఇస్తానంటే కోహ్లీ సున్నితంగా తిరస్కరించాడని వెల్లడి
- తన పద్ధతులపై ఉన్న నమ్మకమే కోహ్లీని గొప్ప ఆటగాడిగా నిలబెట్టిందని ప్రశంస
- విరాట్, రోహిత్ లాంటి ఆటగాళ్లపై తనకు అపారమైన గౌరవం ఉందని వ్యాఖ్య



**డిడి9 వార్త:**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అపారమైన విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం, తన ఆట పద్ధతులపై అతనికి ఉన్న అచంచలమైన నమ్మకమేనని భారత మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ అన్నాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లీ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సమయంలో జరిగిన ఒక సంభాషణను గుర్తుచేసుకుంటూ, కోహ్లీ మైండ్‌సెట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ నాయర్ ఈ విషయాలను పంచుకున్నాడు.

కొన్నేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ వరుసగా రెండుసార్లు డకౌట్ అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పుడే తాను భారత జట్టు సహాయక కోచ్ పదవి నుంచి తప్పుకున్నానని, అయినా కోహ్లీతో టచ్‌లో ఉన్నానని నాయర్ తెలిపాడు. "ఆ సమయంలో నేను కోహ్లీకి ఫోన్ చేసి, అంతా బాగానే ఉందా? ఏమైనా మాట్లాడాలనుకుంటున్నావా? అని అడిగాను. దానికి కోహ్లీ చాలా ప్రశాంతంగా 'అంతా బాగానే ఉంది. ఇదంతా ఆటలో భాగమే' అని సమాధానమిచ్చాడు" అని నాయర్ చెప్పాడు.

ఆ తర్వాత తాను ఒక టెక్నికల్ విషయాన్ని గమనించానని, దాని గురించి చెప్పాలనుకుంటున్నానని కోహ్లీ అనుమతి కోరానని నాయర్ తెలిపాడు. "నేను 'ఒక విషయం గమనించాను. వింటావా?' అని అడిగాను. దానికి అతను నవ్వుతూ 'వద్దు, నేను నా పద్ధతిలోనే చేస్తాను' అని సున్నితంగా తిరస్కరించాడు. నాకు నవ్వొచ్చింది. ఆ తర్వాతి మ్యాచ్ అనంతరం నాకు అతడి నుంచి 'నేను నా పద్ధతిలోనే చేశాను' అనే సమాధానం వచ్చింది" అని నాయర్ ఆ సంభాషణను వివరించాడు.

ఈ ఒక్క సంఘటన విరాట్ కోహ్లీ ఎంతటి గొప్ప ఆటగాడో చెబుతుందని నాయర్ అభిప్రాయపడ్డాడు. "నా దృష్టిలో విరాట్ కోహ్లీ గొప్పతనానికి ఇదే నిదర్శనం. కఠిన సమయాల్లో ఎలా ఆడాలో గొప్ప ఆటగాళ్లకు బాగా తెలుసు. మనం విశ్లేషించగలం, ఊహించగలం. కానీ, వాళ్లు అంతర్జాతీయ స్థాయిలో పదేపదే రాణించి నిరూపించుకున్నారు. అందుకే విరాట్, రోహిత్ వంటి ఆటగాళ్లంటే నాకు అపారమైన గౌరవం" అని నాయర్ తెలిపాడు. తమ మీద తమకు ఉన్న ఈ నమ్మకమే వారిని మిగతా ఆటగాళ్ల నుంచి ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు.

# అర్జెంటీనాకు అనుకూలం అంటూ ఫిఫాపై ఆరోపణలు.. ఎట్టకేలకు మౌనం వీడిన మెస్సీ

- అర్జెంటీనాకు ఫిఫా సహకరిస్తోందన్న వ్యాఖ్యలకు మెస్సీ గట్టి సమాధానం
- కష్టపడి ఆడి ఫైనల్‌కు చేరామని స్పష్టీకరణ
- తమకు అనుకూలంగా ఎవరూ ఏదీ ఇవ్వలేదని వ్యాఖ్య
- ఇంగ్లండ్‌పై గెలిచి ఫైనల్‌కు చేరిన అర్జెంటీనా
- వీఏఆర్, రిఫరీ నిర్ణయాలపై కొనసాగుతున్న విమర్శలు

**డిడి9 వార్త:**

వరల్డ్ కప్‌లో అర్జెంటీనాకు ఫిఫా అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ వస్తున్న ఆరోపణలపై ఆ జట్టు కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎట్టకేలకు స్పందించాడు. తమ విజయాల్లో ఎలాంటి పక్షపాతం లేదని స్పష్టం చేశాడు. కష్టపడి ఆడిన ఫలితంగానే ఈ స్థాయికి చేరుకున్నామన్నాడు. ఎవరూ తమకు అనుకూలంగా ఏదీ ఇవ్వలేదని, ప్రతి గోల్ వెనుక ఎంతో కష్టం ఉందని తేల్చిచెప్పాడు. సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై అర్జెంటీనా విజయం సాధించి వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే.

“మేం గత నాలుగేళ్లుగా అత్యుత్తమ జట్టుగా నిలిచాం. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా వాస్తవం మారదు. వరుసగా రెండు ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరడం చాలా అరుదైన విషయం. మేం సాధించింది అదృష్టంతో కాదు. మా ఆటతోనే ఈ స్థాయికి వచ్చాం” అని మెస్సీ విమర్శకులకు గట్టిగా బదులిచ్చాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఓడిపోయి ఉంటే మరోసారి ఎన్నో ఆరోపణలు వచ్చేవని కూడా మెస్సీ వ్యాఖ్యానించాడు. అయితే మైదానంలో తామే మెరుగైన జట్టుగా నిలిచామని, అందుకే ప్రత్యర్థికి అలాంటి అవకాశం ఇవ్వలేదని చెప్పాడు. ఇలాంటి కీలక మ్యాచ్‌ల్లో చరిత్ర సృష్టించే సంఘటనలు జరుగుతుంటాయని పేర్కొన్నాడు.

ఈ ప్రపంచకప్‌లో అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు గ్రూప్ దశ నుంచే మొదలయ్యాయి. అల్జీరియాతో మ్యాచ్‌లో మెస్సీ చేసిన టాకిల్‌పై చర్యలు తీసుకోలేదంటూ ఆ దేశం అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఈజిప్ట్‌తో మ్యాచ్‌లో వీఏఆర్ నిర్ణయం, స్విట్జర్లాండ్‌తో మ్యాచ్‌లో రిఫరీ నిర్ణయాలపై కూడా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ పరిణామాల తర్వాత అర్జెంటీనాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు సోషల్ మీడియాలో మరింత పెరిగాయి.



# నన్ను ఫొటోలు తీయకండి



బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై ఆసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె (Mouni Roy) వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు.

"నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా" అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు.

ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.

# ఆ ఒత్తిడిని పక్కన పెట్టేయండి

"మీ గురించి విమర్శకులు ఏమనుకున్నా పర్వాలేదు కానీ మీకు మీరు నిజాయతీగా ఉండండ"ని అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. ఓ సందర్భంలో ప్రతికూల వ్యక్తుల పట్ల మనం ఎలాంటి వైఖరిని అలవర్చుకోవాలో, వారి మాటల్ని ఎలా ఎదుర్కోవాలో కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుందామె. "నేను నటించే పాత్రల్లో కాకుండా.. నన్ను నన్నుగా చూడాలని ప్రేక్షకుల నుంచి ఎలాంటి అంచనాలు పెట్టుకోను. అలాంటి అంచనాలు కేవలం నా ప్రియమైన వారిపైనే ఉంటాయి. ఎవరైనా మిమ్మల్ని పనికిరానివారని అంటే.. మీరు నిజంగానే పనికిరానివారైపోతారా? కాదు కదా. కాబట్టి, విమర్శించేవారు ఏమనుకున్నా.. ఏమన్నా సరే పట్టించుకోకండి. మీ కుటుంబం, అభిమానుల పట్ల నిజాయతీగా ఉండండి. మిమ్మల్ని ప్రేమించే వారి పట్ల నిజాయతీగా ఉంటూ మీ శక్తి మేరకు ఉత్తమంగా ఉండడానికి ప్రయత్నించండి. అదే చాలు. అందరినీ మెప్పించాలనే ఒత్తిడిని పక్కన పెట్టేయండి. అప్పుడు జీవితం బాగుంటుంద"ని చెప్పింది. 'వారణాసి' గురించి చెప్తూ.. 'ఈ సినిమా కోసం నేను 14నెలలుగా పనిచేస్తున్నా. ఈ చిత్రంలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేశాను. ప్రస్తుతానికి ఇంతకంటే ఎక్కువ చెప్పలేన'ని అంది ప్రియాంక.





# సినిమా ఖరారైనట్టేనా

చాలా రోజులుగా అల్లు అర్జున్ - బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ప్రచారంలో ఉంది. ఈ ఇద్దరూ కలిసి సినిమా చేస్తున్నారనే సంగతి 'పుష్ప 2' విడుదలైన దగ్గర్నుంచీ వినిపిస్తోంది. మధ్యలో ఒక దఫా కథాచర్చలు కూడా జరిగాయి. కానీ ఆ వెంటనే అల్లు అర్జున్... అట్లీ దర్శకత్వంలో 'రాకా' కోసం రంగంలోకి దిగారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ మరో సినిమాకి పచ్చజెండా ఊపారు. దాంతో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్‌తో అల్లు అర్జున్ సినిమా ఉంటుందో లేదో అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఇప్పుడు మళ్లీ ఆ కలయికపై చర్చ ఊపందుకుంది. అందుకు కారణం దర్శకుడు బసిల్ జోసెఫ్ ఇన్‌స్టాలో పంచుకున్న ఓ పోస్ట్. అది చూసినప్పట్నుంచి ఈ కలయికలో సినిమా ఖరారైనట్టే అని, త్వరలోనే అందుకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలూ ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఐకాన్ అని రాసి ఉన్న టోపీతోపాటు, అల్లు అర్జున్ సినిమాలోని రింగ... రింగ పాటని ఆ పోస్ట్‌లో పంచుకున్నారు బసిల్ జోసెఫ్. ఆ పోస్ట్‌ని పంచుకున్న వెంటనే ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. అల్లు అర్జున్ ఐకాన్‌స్టార్‌గా ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసిందే. ఆయనతో సినిమా ఖరారు కావడంతోనే దర్శకుడు బసిల్ జోసెఫ్ ఈ పోస్ట్‌ని పంచుకున్నారనేది పరిశ్రమ వర్గాల నమ్మకం. బసిల్ నటుడిగా రాణించడంతోపాటు... మలయాళంలో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి ప్రతిభని చాటారు. అందులో 'మిన్నల్ మురళి' సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ పొందింది. దాంతో అల్లు అర్జున్ - బసిల్ కలయికలో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# జననాయగన్ వచ్చేస్తున్నాడు

తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఆఖరి చిత్రం 'జన నాయగన్'. ఈ ఏడాది సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ చిత్రాన్ని ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. 'అగ్ని పరీక్షలో నిలిచి.. కాలం మలిచిన రూపం.. పోరాటం ఎంత కఠినంగా ఉంటే.. విజయం అంత ఘనంగా ఉంటుంది' అనే వ్యాఖ్యల్ని జోడించింది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలకపాత్రలో నటించింది.



# ఇప్పటికీ 'బేబీ' సినిమా డబ్బులు నాకు రాలేదు..



టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం తాజాగా 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో హీరోగా నటించారు. ఈ చిత్రంలో శ్రీ గౌరీ ప్రియ కథానాయికగా నటించగా, రవి నంబూరి దర్శకత్వం వహించారు. సాయి రాజేష్, ఎస్‌కేఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో నిన్న చిత్రబృందం మీడియాతో సమావేశమైంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరంను ఉద్దేశించి, "'క' సినిమా భారీ విజయం సాధించినప్పటికీ, ఆ చిత్ర నిర్మాత మాత్రం తమకు పెద్దగా లాభాలు రాలేదని చెప్పారు. దీనిపై మీ స్పందన ఏమిటి?" అని ప్రశ్నించారు. దీనికి కిరణ్ స్పందిస్తూ, "మాది చిన్న సినిమా. మా చిత్రానికి భారీ స్థాయిలో వసూళ్లు వచ్చి ఉండకపోవచ్చు. కానీ సినిమా మాత్రం మంచి విజయం సాధించింది. అలాగే విడుదలకు ముందే డిస్ట్రిబ్యూటర్లకు అమ్మేశాం. సినిమా ఏ స్థాయిలో ఆడింది, ఎంత వసూళ్లు సాధించింది అనే వివరాలు మీ వద్ద కూడా రికార్డుల రూపంలో ఉంటాయి" అని తెలిపారు. అదే సమయంలో నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ... ఒక సినిమా హిట్ అయినంత మాత్రాన నిర్మాతకు భారీ లాభాలు వస్తాయని అనుకోవడం సరైంది కాదు. నేను నిర్మించిన 'బేబీ' సినిమా పెద్ద విజయం సాధించినప్పటికీ ఇప్పటికీ కొంతమంది నుంచి రావాల్సిన డబ్బులు రాలేదు. నిర్మాతలకు వారి సొంత ఇబ్బందులు ఉంటాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కిరణ్ అబ్బవరం, ఎస్‌కేఎన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# భారీ ధరకు అమ్ముడుపోయిన 'వృషకర్మ' నాన్-థియేట్రికల్ రైట్స్!

అక్కినేని నాగచైతన్య హీరోగా నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ మూవీ 'వృషకర్మ'. ఈ సినిమా విడుదల కాకముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తూ ఇండస్ట్రీ వర్గాల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన నాన్-థియేట్రికల్ డీల్స్ చాలా భారీ రేటుకు క్లోజ్ అయినట్లు ఫిల్మ్ నగర్లో గట్టిగా టాక్ వినిపిస్తోంది. ప్రముఖ ఓటీటీ, శాటిలైట్ సంస్థ అయిన జీ ఛానెల్ ఈ సినిమా నాన్-థియేట్రికల్ రైట్స్‌ను దాదాపు రూ. 50 కోట్లకు సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. రూ. 50 కోట్ల భారీ డీల్ కుదరడంతో, ఈ సినిమా బడ్జెట్‌లో సగానికి పైగా అమౌంట్ కేవలం ఈ ఒక్క రైట్స్ ద్వారానే రికవరీ అయిపోయిందని అంచనా వేస్తున్నారు.

దీనికి తోడు మ్యూజిక్ రైట్స్, అలాగే హిందీ డబ్బింగ్ శాటిలైట్ రైట్స్ కూడా కలిపితే సినిమా బడ్జెట్‌లో మెజారిటీ భాగం ప్రీ-రిలీజ్ బిజినెస్ ద్వారానే వెనక్కి వచ్చేస్తుందని సమాచారం. నిర్మాతలకు ఇది చాలా సేఫ్ ప్రాజెక్ట్‌గా మారబోతోందని టాక్. నాగచైతన్య కెరీర్‌లోనే ఇది వన్ ఆఫ్ ది బెస్ట్ ప్రీ-రిలీజ్ బిజినెస్ రికార్డ్ అని చెప్పవచ్చు. ఇక సినిమా విషయానికి వస్తే.. 'విరూపాక్ష' వంటి సూపర్ హిట్ చిత్రంతో మెప్పించిన టాలెంటెడ్ డైరెక్టర్ కార్తీక్ దండు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైథలాజికల్ మిస్టరీ థ్రిల్లర్ జోనర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. కార్తీక్ దండు మార్క్ సస్పెన్స్ ఎలిమెంట్స్, మిస్టికల్ థ్రిల్లర్ కాన్సెప్ట్ ఈ సినిమాపై అంచనాలను భారీగా పెంచేస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీని డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



# ఆమెతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది..



మలయాళ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయకుడిగా గుర్తింపు పొందిన నటుడు దుల్కర్ సల్మాన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఈయన కేవలం మలయాళ చిత్రాలకే పరిమితం కాకుండా తెలుగు, తమిళం, హిందీ తదితర భాషల్లో నటిస్తూ దేశ వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ 'శ్రీ శ్రీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా కనిపించనుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను దక్కించుకుంది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దుల్కర్ సల్మాన్ తనకు అత్యంత ఇష్టమైన నటి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. నాకు అత్యంత ఇష్టమైన నటీమణుల్లో కాజోల్ ఒకరు. తన అద్భుతమైన నటనతో ఎన్నో పాత్రలకు ప్రాణం పోశారు. ఎన్నో సంవత్సరాల పాటు స్టార్ హీరోయిన్‌గా కొనసాగి, ఇప్పటికీ అదే స్థాయిలో తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఎంతోమంది నటీమణులకు ఆమె ఆదర్శంగా నిలిచారు. అందుకే ఆమెంటే నాకు ఎంతో అభిమానం. ఆమెతో కలిసి నటించే అవకాశం వస్తే ఎంతో ఆనందంగా స్వీకరిస్తానని తెలిపారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.